# లైసన్స్ బిళ్ళ

వసంత

సత్యం గమ్మత్తుగా నవ్వి యిదంతా గప్ చిప్ అన్నాడు. విమల గుండెలు భయంతో గుబగుబలాడాయి. మనస్సు తీవ్రంగా ఆలోచించింది. మరీ అంత బరి తెగింపా అనుకుంది —

కానీ విమల మనస్సు అదుపు తప్పింది. ఆఫీసర్ వచ్చినప్పుడు అతి జాగ్రత్తతో గమనించింది. సత్యం చెప్పినదాంట్లో అబద్ధమేమీ లేదని గ్రహించింది. అందుకనే పని చేతకానివాళ్ళూ, సీటుమీద ఐదు నిమిషాలు కూర్చోలేని సోమరులూ ప్రమోషన్ మీద ప్రమోషన్ పొందుతున్నారు. జీవితంలో వాళ్ళు గొప్పగా రాణిస్తున్నారు. అదంతా తమ శక్తి సామర్థ్యాల వల్లేనని ప్రగల్భాలు పలుకుతున్నారు.

ఆఫీసరైనా సంసారి స్త్రీనే అమృతంలా తనివితీరా జుర్రుకుంటాడట. దానివల్ల గుట్టు రట్టుకాదు. సుఖరోగాలు అంటవు. ఒకవేళ ఆమె గర్భిణి అయినా బాధలేదు. ఎందుకంటే మంగళసూత్రలు మెడలో వ్రేలాడుతూ సదా ఆమెను రక్షిస్తాయి. ఆఫీసర్ ముద్దుగా. ముద్దుగా ముందు అడుగుతాడట. లైసెన్స్ బిళ్ళ ఉందా అని. లేదంటే ఆమె గాలిని కూడా సోకనివ్వడట.

అవును మరి! రిక్షా త్రొక్కడానికి రిక్షావాడి మెడలో లైసెన్స్ బిళ్ళ ఉంటుంది. డ్రైవర్‌కీ ఉంటుంది లైసెన్స్ కారు నడపడానికి. మాతృత్వం పొందడానికి స్త్రీకీ ఉంటుంది మెడలో మంగళసూత్రాల లైసెన్సు యిస్తూ.

అందుకనే విమల సాహసించింది ఒక రాత్రి. మరుక్షణంలో ప్రమోషన్ ఆర్డర్స్ చేతికి వచ్చాయి. కానీ....ఆ నాటి పాపానికి గుర్తుగా ఆమెలో మరొక క్రొత్త ప్రాణి కదులుతోంది.

నైతిక బలంతో, పతివ్రతననే గర్వంతో ఠీవిగా, దర్పంగా తిరిగిన విమలలో కొంత బెరుకు కలిగింది. కానీ నిండా మునిగిన వాళ్ళకు చలేమిటి?

ఆ రాత్రి శోభనపు పెళ్ళికూతురులా తయారై భర్త దగ్గరికి వెళ్ళింది పాలగ్లాసుతో.

విమల కన్నా అతడే ముందు పల్కరించాడామెను.

"అటు ఉద్యోగం, యిటు యింటిపని, పిల్లల చాకిరి చేయలేక అలిసి పోతున్నానని గోల పెట్టావుగా. నీ మాట వినలేదని కూడ విసుక్కున్నావు. గుర్తుందా మూడు నెలల క్రితం గవర్నమెంటు హాస్పిటల్‌లో నా క్లాస్ మేట్ డాక్టరుగా వచ్చాడు. జాగ్రత్తగా చేస్తాడని వాడితో ఆపరేషన్ చేయించుకొన్నా. వాసెక్టమీలో కూడ అప్పుడప్పుడు ఫెయిల్యూర్స్ ఉంటాయని నీతో చెప్పలేదు. నిన్న టెస్ట్ చేయించుకొన్నా. "ఓ కే గ్రాండ్ సక్సెస్" అన్నాడు. ఈ శుభవార్తకి నాకేమి ప్రజంటేషన్ యిస్తావ్" అని కొంటెగా సంతోషం చిందులేస్తున్న కళ్ళతో అడుగుతున్న శ్రీవారిని పాలిపోయిన ముఖంతో చూచింది పాపం, విమల.

రక్షణ యివ్వలేని లైసెన్స్ బిళ్ళ (మంగళ సూత్రం) ఫక్కున నవ్వింది. ఆమె అవస్థను చూసి. ★